క్లుప్తంగా

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం



బొల్లాపల్లి: మండలంలోని రేమిడిచర్ల సచివాలయ పరిధిలో నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జిలానీబాషా శుక్రవారం తెలిపారు. వైద్య శిబిరం నిర్వహణపై గ్రామ సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. సచివాలయం పరిధిలోని కుటుంబాలు ఆరోగ్య సురక్షను సద్వినియోగపరచుకోవాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగ పరచుకోవాలని సూచించారు. బొల్లాపల్లి పీహెచ్‌సీ వైద్యులు సాయి వినూత్న, కృష్ణానాయక్, ఇరు వైద్య బృందాలతో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని, స్థానికంగా జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో వైద్యాధికారులు, సచివాలయ సిబ్బంది, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నాదెండ్లలో క్యాంపు షెడ్యూలు ఇలా..

నాదెండ్ల: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య క్యాంపు షెడ్యూలును విడుదల చేసినట్లు ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ తెలిపారు. ఈ నెల 30న సంకురాత్రిపాడులోని ప్రాథమిక పాఠశాలలో, 3వ తేదీన నాదెండ్ల ఎస్వీ ప్రాథమిక పాఠశాలలో, 5న ఇర్లపాడులో, 7న చిరుమామిళ్ళ ప్రాథమిక పాఠశాలలో, 9న తూబాడులో, 10న సాతులూరు1 నందు, 13న కనపర్రు, 17న ఎండుగుంపాలెం, 19న గొరిజవోలు, 26న సాతులూరులో క్యాంపులు జరుగుతాయన్నారు. రెండు టీంలుగా ఆయా గ్రామాల్లో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి క్యాంపులో ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, సీనియర్ అసిస్టెంట్లు సైదారావు, డీటీ అనురాధ, రెండవ క్యాంపులో తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఏసీడీపీవో నిర్మలారాణి, ఎంఈవో ఆంజనేయులు పాల్గొంటారన్నారు. ప్రతి క్యాంపులో ఇరువురు స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యాన్ని పరిరక్షించాలి

చిలకలూరిపేట: తమ ఆరోగ్యాలను పణంగా పెట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు అహర్నిశలు శ్రమించే పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యాన్ని పరిరక్షించాల్సిన ఆవశ్యకత ఉందని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు చెప్పారు. స్వచ్ఛతలీగ్ 2.0, ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ చిగురుపాటి రామారావు మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో పారిశుద్ధ్య కార్మికులకు గుండె పరీక్షల శిబిరం శుక్రవారం నిర్వహించారు. శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ గోవిందరావు మాట్లాడుతూ నిత్యం మురుగు, అపరిశుభ్రతపై పోరాడే పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యం విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇలాంటి వైద్య శిబిరాలు వారికి ఎంతో మేలు చేస్తాయని ముందుగా వ్యాధులను గుర్తించేందుకు ఉపయోగపడతాయని వెల్లడించారు. పారిశుద్ధ్య కార్మికులకు కార్డియాలజిస్ట్ డాక్టర్ చిగురుపాటి రామారావు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు కొలిశెట్టి శ్రీనివాసరావు, వలేటి వెంకటేశ్వరరావు, మున్సిపల్ డీఈఈ తోట వెంకటరమణ, శానిటరీ ఇన్స్పెక్టర్ షేక్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తికి దాతల సహకారం అభినందనీయం



క్రీడా సామగ్రి వితరణ చేస్తున్న దాతలు

శావల్యాపురం: క్రీడా స్ఫూర్తికి దాతల సహకారం అభినందనీయమని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాలికల జట్టుకు దాతల సహకారంతో క్రీడా దుస్తులు, షూస్ పంపిణీ కార్యక్రమం పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో పోటీలో మంచి ప్రతిభ సాధించి శావల్యాపురం మండలానికి మంచిపేరు తేవాలన్నారు. దాతలు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భీమని అంకారావు రూ. 7 వేలు, క్రీడా షూస్, పాఠశాలలో లెక్కల ఉపాధ్యాయులు కె.హనిమిరెడ్డి రూ.5500, క్రీడా దుస్తులు వితరణ చేశారు. అలాగే దాతలు జవంగుల బాబు రూ. 3.400, యం.విజయ్‌భాస్కర్ రూ.3.400, వంగూరి ప్రసాదు రూ. 3.400, అంగటి నాగరాజు రూ. 3.400, నాగేంద్రుడు రూ.3.400, నగదును తమవంతు వితరణ చేయగా క్రీడాకారులకు ఫైబర్ బ్యాట్స్ అందజేసినట్లు పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొణతం ఏరుకలరెడ్డి, చిట్టేటి రవి, దేవన బోయిన వీరనారాయణ, ముట్లూరి సత్యం, పొట్టిపాటి శ్రీనివాసరావు, మదార్, లోమడ చెన్నుబాబు, పాపసాని బ్రహ్మయ్య, ఉపాధ్యాయులు బెజవాడ నాగేశ్వరరావు, పీడీ రాధాకృష్ణమూర్తి, వెంకటరత్నం, సుభాష్ చంద్రారెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

టీడీపీ సభ్యుల తీరు అనుచితం

- ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చకు రాకుండా అడ్డుకుంటున్నారు
- మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని



టీడీపీ సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, సభ్యులు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని

చిలకలూరిపేట: ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులు చర్చకు రానీయకుండా టీడీపీ సభ్యులు అడ్డుకోవడం అనుచితమని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత వహించారు. సమావేశం ప్రారంభం కాగానే టీడీపీ కౌన్సిలర్ గంగా శ్రీనివాసరావు లేచి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ మౌన దీక్ష చేస్తున్నట్లు వెల్లడించారు. టీడీపీకి చెందిన 8 మంది కౌన్సిలర్లు ముఖాలకు నల్ల రిబ్బన్లు కట్టుకొని వారివారి స్థానాల్లో కూర్చొన్నారు. ఎజెండా చదవమని చైర్మన్ చెప్పాక టీడీపీ కౌన్సిలర్లు వారి స్థానాల నుంచి లేచి చైర్మన్ పోడియం ముందు బైఠాయించారు. దీంతో వైఎస్సార్ సీపీకి చెందిన వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు పిల్లి సాగర్‌బాబు, బేరింగ్ మౌలాలి, అన్నపరెడ్డి శ్రీలక్ష్మి, వడితే కోట్యానాయక్ తదితరులు టీడీపీ సభ్యుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డుల్లో సమస్యలు ప్రస్తావనకు రాకుండా రాజకీయ ఎజెండాతో సమావేశానికి అడ్డు తగులుతున్నారని విమర్శించారు. ఈ తరుణంలో మున్సిపల్ చైర్మన్ పలుమార్లు సీట్లలోకి వెళ్లి కూర్చోవాలని టీడీపీ సభ్యులకు చెప్పినా ఆలకించకుండా అలాగే బైటాయించారు. దీంతో మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తప్పు చేశారు కాబట్టే చంద్రబాబు నాయుడిని న్యాయస్థానం రిమాండ్‌కు పంపిందని స్పష్టం చేశారు. టీడీపీ సభ్యులు నిరసన తెలపదలుచుకుంటే వెళ్లి న్యాయస్థానం ముందే బైఠాయించాలని, ఇలా సభా సమయాన్ని వృథా చేయరాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ సమావేశం రాజకీయ వేదిక కాదని గుర్తించాలని కోరారు.

ఆక్రమణలు తొలగించండి

సమావేశం ప్రారంభంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఇరువురు విద్యార్థులకు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా పదోవార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి మాట్లాడుతూ పట్టణ పరిధిలో ఆక్రమణలు పెరిగిపోయాయని సమావేశం దృష్టికి తెచ్చారు. పలు సెంటర్లలో బస్‌షెల్టర్లు ఎక్కడ ఉన్నాయో అర్థంకాని రీతిలో ఆక్రమణలు ఉన్నాయని తెలిపారు. ఎన్ఆర్‌టీ సెంటర్ నుంచి భాస్కర్ సెంటర్ వరకు పలు టీస్టాళ్లు, ఇతర దుకాణాలకు సంబంధించిన వారు శృతి మించి ఆక్రమణలకు పాల్పడటంతో పార్కింగ్‌కు అవకాశం లేకుండా పోయిందని, దీంతో వాహనదారులు రోడ్లకు అడ్డంగా వాహనాలను నిలుపుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి కారణాలతో రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయని సమావేశం దృష్టికి తెచ్చారు. స్పందించిన మున్సిపల్ చైర్మన్ రఫాని మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్, కౌన్సిలర్లు, పోలీసులతో కూడిన టీం ప్రధాన కూడళ్లను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. వెంటనే టీం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ కౌన్సిలర్లు అలాగే బైఠాయించి ఉండటంతో ఎజెండాలోని అన్ని అంశాలను ఆమోదిస్తున్నట్లు తెలిపి సమావేశాన్ని ముగించారు.

ముమ్మరంగా రీసర్వే పనులు

- భూహక్కు పత్రాల్లో తప్పులు సవరణకు అవకాశం
- ఎల్‌పీయం విధానం ద్వారా ఆర్థిక లావాదేవీల నిర్వహణ
- 40 గ్రామాల్లో 51 వేల 741 మంది రైతులకు భూహక్కు పత్రాలు మంజూరు
- ఆర్డీవో శేషిరెడ్డి



రైతులు అడిగిన సమస్యపై వివరణ ఇస్తున్న ఆర్డీవో శేషిరెడ్డి, రెవెన్యూ అధికారులు

శావల్యాపురం: డివిజన్ పరిధిలో రీసర్వే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని ఆర్డీవో మర్రెడ్డి శేషిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గంటావారిపాలెం గ్రామంలో భూహక్కు పత్రాలు పొందిన రైతులకు సంబంధించి వలంటీర్లు ఈకేవైసీ నమోదు చేసే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 40 రెవెన్యూ గ్రామాల్లో నేటి వరకు 51 వేల 741 మంది రైతులకు భూహక్కు పత్రాలను ప్రభుత్వం మంజూరు చేయగా ఇప్పటి వరకు 22 వేల 705 మంది రైతులకు భూహక్కు పత్రాలను అందజేశామన్నారు. మిగులు ఉన్న భూహక్కు పత్రాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరతిగతిన నూరుశాతం పంపిణీ జరిగేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టామన్నారు. ఇక నుంచి భూహక్కు పత్రాలు పొందిన రైతులు సర్వే నంబర్లు స్థానంలో భూ పరిమాణం పటం (ఎల్‌పీయం) ద్వారా ఆర్థిక లావాదేవీలు నిర్వహణ జరుగుతుందన్నారు. భూహక్కు పత్రాలు పొందిన రైతులు తమ భూముల్లో ఏమైనా విస్తీర్ణ తేడాలు ఉన్నా, పేర్లలో మార్పులు చేర్పులు, ఆధార్ తప్పులు సవరణలు తదితరవన్నీ చేయాల్సిన రైతులు ఆయా గ్రామ సచివాలయాలో తగిన ఆధారాలతో దరఖాస్తు చేసుకుంటే తహసీల్దార్లు లాగిన్ ద్వారా సమస్య పరిష్కార దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అలాగే భూములు రిజిస్ట్రేషన్లు గ్రామ సచివాలయాల్లో జరుగుతాయన్నారు. రీసర్వే పనులకు సంబంధించి రెవెన్యూ అధికారులకు రైతులు సహకరించాలన్నారు. శావల్యాపురం మండలంలో వేల్పూరు, పిచికలపాలెం, పొట్లూరు, కనమర్లపూడి రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పనులకు సంబంధించి భూహక్కు పత్రాలు మంజూరైనట్లు చెప్పారు. భూహక్కు పత్రాలు పొందిన రైతులు ఏమైనా ఇబ్బందులు ఉన్న పక్షంలో ఆందోళన పడాల్సిన పనిలేదని, అపోహలు నమ్మరాదన్నారు. ఆయనతో పాటు తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, రీసర్వే డిప్యూటీ తహసీల్దారు పేరుసోముల నాసరయ్య, వీఆర్వోలు శ్రీనివాసరావు, వీరవల్లి నాగ సంతోషలక్ష్మి రైతులు పాల్గొన్నారు.

భూహక్కు పత్రాలు పంపిణీ

రొంపిచర్ల: మండలంలోని వీరవట్నం, మునమాక, సుబ్బయ్యపాలెం గ్రామాల్లో ఆర్డీవో శేషిరెడ్డి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సర్వే పూర్తి అయిన భూ యజమానులకు జగనన్న భూహక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జి.అంకారావు, డిప్యూటీ తహసీల్దార్ బాల వెంకటేష్, రెవెన్యూ అధికారులు, వలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి విడదల సాంబశివరావు

జాషువా సాహితీ పురస్కార గ్రహీతకు ఘన సన్మానం



విడదల సాంబశివరావును సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కౌన్సిలర్లు

చిలకలూరిపేట: బహుముఖ ప్రజ్ఞాశాలి విడదల సాంబశివరావు అని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని కొనియాడారు. కవి, రచయిత, రంగస్థల నటుడు, నాటక దర్శకుడు విడదల సాంబశివరావుకు మహాకవి గుర్రం జాషువా జయంతి సందర్భంగా ఏపీ అధికార భాషాసంఘం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జాషువా సాహితీ పురస్కారాన్ని అందజేశారు. దీనిని పురస్కరించుకొని పురపాలకసంఘం ఆధ్వర్యంలో సాంబశివరావుకు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ రఫాని మాట్లాడుతూ చిన్న వయసు నుంచే నటన పట్ల ఆసక్తి పెంచుకొన్న విడదల సాంబశివరావు కవిత, కథ, నాటకరచన, వివిధ అంశాలపై సాహితీ వ్యాసాలతో పాటు రంగస్థలంపై, టీవీ, సినీ రంగాల్లోనూ రాణించటం చిలకలూరిపేటకు గర్వకారణమని చెప్పారు. గత 53 సంవత్సరాలుగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని పరిషత్తుల్లో ఆయన రచించిన, నటించి దర్శకత్వం వహించిన నాటకాలు ప్రదర్శించబడ్డాయని వెల్లడించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరావు మాట్లాడుతూ మత కలహాల నేపథ్యంలో ఆయన రచించి దర్శకత్వం వహించిన నాటిక ధ్వంసరచనకు 2008లో రాజమండ్రిలో జరిగిన నంది నాటకోత్సవాల్లో బంగారు నంది బహుమతి గెలుచుకుందని తెలిపారు. అలాగే హైదరాబాద్‌లో జరిగిన నంది నాటకోత్సవాల్లో ఆయన ప్రదర్శించిన వటుడు నాటికకు ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా ఎంపికై రజిత నంది గెలుచుకుందని వెల్లడించారు. కొమరవల్లిపాడు పీఏసీఎస్ మాజీ చైర్మన్ తోట బ్రహ్మస్వాములు మాట్లాడుతూ సమాజంలో చైతన్యం తీసుకురావడమే లక్ష్యంగా విడదల సాంబశివరావు రచనలు, కవితలు కొనసాగాయని కొనియాడారు. నాటక రంగ కళాకారుడిగా మాత్రమే కాకుండా ఆర్ నారాయణమూర్తి దర్శకత్వం వహించిన ఊరు మనదిరా సినిమాలో తెలంగాణా రైతు పాత్రలో జీవించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవినేని శంకరరావు, నాదెండ్ల జెడ్పీటీసీ సభ్యుడు కాట్రగడ్డ మస్తాన్‌రావు, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ అల్లీమియా, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నాదెండ్లలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

నేడు సంకురాత్రిపాడులో వైద్య క్యాంప్



నాదెండ్లలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

నాదెండ్ల: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. మొదటి విడతలో సంకురాత్రిపాడు గ్రామంలో సర్వే పూర్తి చేశారు. రెండో విడతలో మరికొన్ని గ్రామాల్లో ఆరోగ్య సురక్ష సర్వే జరుగుతున్నట్లు నాదెండ్ల పీహెచ్‌సీ వైద్యులు ప్రియాకం, సాయిశ్వేత తెలిపారు. ఈ నెల 10న ప్రారంభమైన సర్వే శుక్రవారంతో ముగిసింది. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్ ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, సూపర్‌వైజర్లు, వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందించారు. ఆరోగ్యశ్రీపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. ఆరోగ్యశ్రీ అవసరమైన వారికి కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేసేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు తెలిపారు.

నేడు సంకురాత్రిపాడులో...

మండలంలోని సంకురాత్రిపాడు గ్రామ ప్రాథమిక పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య క్యాంప్ నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ జెట్టి నాగమణి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ స్థానిక వైద్యులతో పాటూ జనరల్ మెడిసన్, చిన్నపిల్లల వ్యాధి నిపుణులు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ మస్తాన్‌రావు, ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్, మండల ఉపాధ్యక్షురాలు సీతామహాలక్ష్మి తదితరులు హాజరౌతారన్నారు.

ముగిసిన నియోజకవర్గ ఆటల పోటీలు



క్రీడాకారులతో కబడ్డీ ఆడుతున్న ఎంఈవో ఆంజనేయులు



జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులతో పీఈటీలు, ఉపాధ్యాయులు

నాదెండ్ల: సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చిలకలూరిపేట నియోజకవర్గస్థాయి ఆటల పోటీలు శుక్రవారంతో ముగిశాయి. జిల్లా జట్లను ఎంపిక చేశారు. పోటీలను సర్పంచ్ ముసుగు శోభారాణి, ఎంపీటీసీ పాటిబండ్ల రాజేశ్వరి, ఎంఈవోలు ఆంజనేయులు, ఈమని కృష్ణారెడ్డి ప్రారంభించారు. అథ్లెటిక్స్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, యోగ, బాల్‌బ్యాడ్మింటన్, టెన్నీకాయిట్ పోటీలు నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో 42 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి 500 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. అండర్ 14, 17 విభాగాల్లో బాల బాలికలకు విడివిడిగా సెలక్షన్స్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ, క్రీడాకారుడు ఆటపై ఏకాగ్రత, నైపుణ్యం కలిగి ఉండాలన్నారు. విద్యతో పాటూ క్రీడల్లో రాణిస్తే భవిష్యత్ బాగుంటుందన్నారు.

ఆటల ద్వారా మంచి ఆరోగ్యంతో పాటూ మానసిక వికాసం బాగుటుందన్నారు. నియోజకవర్గస్థాయిలో ఎంపికై న జట్లు త్వరలో పల్నాడు జిల్లాలో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరావు, పీఈటీ కె.అంజమ్మ, నియోజకవర్గ స్కూల్‌గేమ్స్ కన్వీనర్ షేక్ అచ్చేమియా, జిల్లా పీఈటీల సంఘం అధ్యక్షుడు పఠాన్ ఖాదర్‌మస్తాన్, పీఈటీలు జాస్తి శ్రీకాంత్, ఏఎంజీ రాజు, వేణుగోపాల్, మున్నంగి సుబ్బారావు, ఫిలిప్‌రాజు, నాగరాజు తదితరులు ఉన్నారు.

శావల్యాపురంలో స్వచ్ఛతా ర్యాలీ

శావల్యాపురం: మండల కేంద్రమైన శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల్లోని విద్యార్థులచే స్వచ్ఛతాహి భారత్ అవగాహన ర్యాలీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో పుసులూరి లలితాకుమారి పాల్గొని మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రతి ఒక్కరు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డి పి.సుగుణ, జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి, మండల స్వచ్ఛత కోఆర్డినేటరు గుండాల కోటేశ్వరరావు, కంప్యూటరు ఆపరేటర్ నలబోతుల వరలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

వేర్వేరు క్రీడాపోటీలకు పలువురు విద్యార్థులు



శావల్యాపురంలో ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు



వినుకొండలో ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హవీలీ



జిల్లాజట్లకు ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు



నరసరావుపేటలో విద్యార్థినులను అభినందిస్తున్న పాలకవర్గ ప్రతినిధులు



రంగమహాలక్ష్మి



వర్షిత

నరసరావుపేట రూరల్: లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థిని దూపాటి రంగమహాలక్ష్మీ జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయినీ ఎం.పార్వతి శుక్రవారం తెలిపారు. కాకినాడ జేఎన్‌టీయూలో ఈనెల 27న నిర్వహించిన సబ్‌జూనియర్, జూనియర్ మహిళా ఖో-ఖో పోటీలలో మహాలక్ష్మీ ప్రతిభ కనబర్చి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. అక్టోబర్ 10వ తేదీన తమిళనాడులోని హోసూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీ లలో రాష్ట్ర జట్టుకు మహాలక్ష్మి ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. అలాగే ఈనెల 24వ తేదీన గుంటూరులో నిర్వహించిన ఉమ్మడి గుంటూరు జిల్లాలో సబ్ జూనియర్ బాల్‌బాడ్మింటన్ పోటీలలో పాఠశాలకు చెందిన చేకూరి వర్షిత ప్రతిభ కనబర్చి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. నంద్యాలలో ఈనెల 30వ తేదీ నుంచి జరిగే రాష్ట్ర స్థాయి పోటీ లలో వర్షిత పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థినీలను పాఠశాల వ్యాయామోపాధ్యాయులు జి.ఝాన్సీరాణి, టి.తిరుపతిరావు, ఎస్‌కె.ఫాతిమా, ఉపాధ్యాయులు అభినందించారు.

వినుకొండలో...

వినుకొండ టౌన్: తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల పేరేచర్లలో టెన్నిస్ బాల్ క్రికెట్, బాపట్లలో నిర్వహించిన సాఫ్ట్ బాల్ విభాగాలలో జిల్లా జట్ల ఎంపికలో ప్రతిభ కనబరిచి, ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హవీలీ శుక్రవారం పేర్కొన్నారు. టెన్నిస్ బాల్ క్రికెట్ అండర్-17 విభాగంలో ఎ. హర్షవర్ధన్ ఎంపిక కాగా, సాఫ్ట్ బాల్ అండర్-14విభాగంలో ఎం. దుర్గానాయక్, అండర్-17 విభాగంలో ఆర్.భువనేంద్ర ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయులు వెంకటరమణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వంకాయలపాడులో...

యడ్లపాడు: స్కూల్‌గేమ్స్ క్రీడాపోటీలకు జిల్లాజట్లకు మండలంలోని వంకాయలపాడు జెడ్పీహైస్కూల్ విద్యార్థులు ఆరుగురు విద్యార్థులు ఎంపికై నట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జాలాది రవి తెలిపారు. చిలకలూరిపేట నియోజకవర్గస్థాయి వివిధ క్రీడా జట్లకు ఎంపికై న విద్యార్థులతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన పీఈటీ శ్రీనివాసరావును శుక్రవారం అభినందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ఇటీవల జరిగిన లూథరన్ హైస్కూల్లో జరిగిన మండలస్థాయి పోటీల్లో, అలాగే శుక్రవారం నాదెండ్ల మండలం సాతులూరు జెడ్పీహైస్కూల్లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి జట్ల ఎంపిక ప్రక్రియలో తమ పాఠశాల విద్యార్థులు మంచి క్రీడానైపుణ్యం ప్రదర్శించినట్లు వెల్లడించారు. దీంతో నాలుగు విభాగాల్లో ఆరుగురు విద్యార్థులు జిల్లాస్థాయి జట్లకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన వారిలో అండర్-17 కబడ్డీ బాలుర విభాగంలో శివ శంకర్, అండర్-14 బాలికల విభాగంలో నాగవైష్ణవి, జుబేదా, ఖో-ఖో బాలిక విభాగంలో భారతి, వాలీబాల్ బాలుర విభాగంలో సనావుల్లా, నీరథ్ ఎంపికై య్యారని వివరించారు. అనంతరం వంకాయపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ వడ్డేపల్లి నరసింహారావు, పాఠశాల పీఎం చైర్మన్ షేక్ ఖాదర్‌బాషా, అభినందించారు.

జాతీయ టైక్వాండో పోటీలకు...

నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థినులు ఎం.ఎం.అంజలీ సాయిలక్ష్మీ, వి.తులసీతన్మయిలు జాతీయస్థాయి టైక్వాండో పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదనరావు శుక్రవారం తెలిపారు. రేపల్లెలో ఈనెల 16, 17 తేదీలలో బోధిధర్మ టైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 3వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జూనియర్స్, సీనియర్స్ టైక్వాండో చాంపియన్ షిప్ పోటీలో తమ విద్యార్థినులు సాయిలక్ష్మీ 46 కేజీల విభాగం, తులసీ తన్మయ్ 52 కేజీల విభాగంలో బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు వివరించారు. అధ్యక్ష, కార్యదర్శులు విజయకుమార్, సుబ్బరాయగుప్త అభినందించారు.

కారుమంచి విద్యార్థులు..

శావల్యాపురం: కారుమంచి గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీల్లో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు ఉమామహేశ్వరరావు శుక్రవారం తెలిపారు. 27న బాపట్లలో విలియం బూత్ సాల్వేశాషన్ ఆర్మీ స్కూల్లో జరిగిన జిల్లాస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలు జరిగినట్లు చెప్పారు. అక్టోబరు నెలలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో బత్తుల యశ్వంత్, బత్తుల రామాంజినేయులు ఇరువురు విద్యార్థులు పాల్గొంటారన్నారు.

చేతి పంపుల నిర్మాణానికి భూమి పూజ

శావల్యాపురం: మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో తాగునీటి సమస్యను అధిగమించేందుకు పంచాయతీ నిధులతో ఏడు బోరింగుల నిర్మాణాన్ని చేపట్టినట్లు సర్పంచ్ బోడాల వీరాంజినేయులు శుక్రవారం తెలిపారు. మొదట ఎస్టీ కాలనీలోని అంకమ్మ తల్లి దేవాలయంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న బోరింగ్ నిర్మాణానికి సర్పంచ్ బోడాల వీరాంజినేయులు, ఉప సర్పంచ్ చింతా విజయ్‌కుమార్ పాల్గొని భూమి పూజ చేశారు. అలాగే ఎస్సీ శ్మశాన వాటిక, నూతన ఎస్టీ కాలనీల్లో చేతి పంపులు నిర్మాణానికి చేపట్టారు. ఈకార్యక్రమంలో శ్రీఅడవి పేరంటాలమ్మ దేవాలయం ట్రస్టు బోర్డు చైర్మన్ సోమేపల్లి వీరాంజినేయులు, గ్రామనాయకులు అల్లూరి వెంకయ్య, వెంకట్రావు, కుంకు పేరయ్య, బోడాల ప్రసాదు, కుంచాల పేరయ్య, యడవల్లి శ్రీను పాల్గొన్నారు.

గుండె నొప్పికి సీపీఆర్ చాలా అవసరం

- పోలీసులకు ఆ విధానంపై అవగాహన కల్పించిన వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి
- ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా కార్యక్రమం ఏర్పాటు



సీపీఆర్ విధానాన్ని చేసి చూపిస్తున్న డాక్టర్ శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట: హఠాత్తుగా గుండె నొప్పితో మనిషి కుప్పకూలిపోయినప్పుడు కార్డియో పల్మనరీ రెసస్సిటేషన్ (గుండె పునర్నిర్మాణం) పద్ధతిలో ప్రయత్నిస్తే మనిషి ప్రాణాలు కాపాడచ్చని మహాత్మా గాంధీ హాస్పిటల్ అధినేత, ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ కారసాని శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ గుండె దినోత్సవం (వరల్డ్ హార్ట్‌డే) పురస్కరించుకుని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి కోరికపై జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్‌హాలులో హఠాత్తుగా హృద్యోగ సమస్యలు తలెత్తినప్పుడు చేపట్టవలసిన సీపీఆర్ ప్రక్రియ నిర్వహణ గురించి పోలీసు అధికారులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చాతిలో నొప్పి కారణంగా హఠాత్తుగా మనిషి కుప్పకూలిపోయిన సమయంలో అంబులెన్స్ వచ్చే సమయంలోగా మనిషి ప్రాణాలను నిలపడం కోసం సీపీఆర్ పద్ధతిని ఉపయోగించడం ఉత్తమమైన విధానమన్నారు. దీనివల్ల ఎంతో మందిని ప్రాణాప్రాయం నుంచి బయటకు తీసుకురావటం జరిగిందన్నారు. ఒక సింథటిక్ మనిషి బాడీతో పోలీసులకు సీపీఆర్ ప్రక్రియ ఏ విధంగా చేయవచ్చునో అవగాహన కల్పించారు. అనంతరం పోలీసు వారిచే కూడా డెమో చేయించారు. జిల్లా అదనపు ఎస్పీ (ఏఆర్) డి.రామచంద్ర రాజు, నరసరావుపేట డీఎస్పీ కేవీ మహేష్, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

సారా తయారీ కేంద్రంపై దాడులు

100 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



నరసరావుపేట టౌన్: అక్రమంగా నాటు సారా తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు చేజర్ల గ్రామంలో దాడులు నిర్వహించి 100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ సురేంద్రబాబు శుక్రవారం తెలిపారు. చేజర్ల గ్రామంలో నాటు సారా తయారు చేస్తున్నారన్నా సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించామన్నారు. పోలీసుల రాకను ముందే పసిగట్టిన అక్రమార్కులు సారా తయారీకి ఉపయోగించే సామగ్రి అక్కడే వదిలి పారిపోయారన్నారు. సంఘటనా స్థలంలో సుమారు 100 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.